


# పరిభ్రమణం

ఓలాప్ర బాలకేశవ్రు

అతను ఆలోచిస్తున్నాడు. అతను అనబడే ఆనంద్ అప్పుడప్పుడూ అలా ఆలోచిస్తూనే ఉంటాడు ఎప్పుడయినా కాగితం, కలం తీసి ఏదో వ్రాస్తూ వుంటాడు ఆ వ్రాసేది కధో, నవలో, స్వీయచరి తో తనది తనకే తెలియదు – తను వ్రాసే తుదీ, మొదలూలేని ఆ మహా ప్రస్థానానికి అర్థమూ, ప్రయోజనమూ ఏమిటో కూడా తను ఊహించు కోవటంలేదు. అయినా వ్రాస్తుంటాడు.

పదిమంది మనుష్యులు లేని ఏకాంత ప్రదేశంలో కూర్చోవాలనిపిస్తూ వుంటుంద తనకి. అందుకే అతను ఎవ్వరితోనూ మాట్లాడడు. ఎవరైనా మాట్లాడితే పది మాటలకి ఒక్క మాట మాత్రం సమాధానం చెపుతాడు. కళ్ళు చెమ్మగిల్లినా అతని పెదవులు నవ్వుతూనే వుంటాయి. ఆ నవ్వులో ఏ భావం వుందో, అతని అంతర్యంలో ఏ బాధ రగులుతోందో అతనికే అర్థంకాదు. "నేను బాధ పడుతున్నానా ?" అని తనని తనే ప్రశ్నించు కుంటూ డొక్కక్క పుడు.. 'ఏమో ?' ఎదురు ప్రశ్న వేస్తోంది అంతరాత్మ

"ఎవరి కోసం ?" "అదీ తెలీదు"

ఆనంద్‌కో అమ్మా, తమ్ముళ్ళూ, చెల్లెళ్ళూ, కష్ట సుఖాల్లో పాలు పంచుకునే భార్యా అందరూ వున్నారు అందరూ హాయిగా, ఆనందంగా, ఆరోగ్యంగానే వున్నారు లక్షలు లేకపోయినా తిండికీ, గుడ్డకూ లోటు లేకుండా గడిచిపోయే సంపాదనా వుంది. అయితే తను మరెందుకు బాధ పడాలి ? ఎవరి కోసం ?

అతని ఆలోచనల మధ్య అస్పష్టంగా ఆమె రూపం కదులుతూంది "ఆమె...ఆమె ...ఆమెకోసం తను బాధ పడుతున్నాడా ?... ఛీ ! అదేంలేదు" అనుకున్నాడతను.

వేళ్ల మధ్య చివరి వరకూ కాలిన సిగరెట్ పీక చురుమని వేలికి తగిలింది ఉలిక్కిపడి, ఆలోచనల మధ్య నుండి ఆనంద్ మేలుకున్నాడు అసంపూర్తిగా వున్న తన రచనా కాగితాలు మడిచి ప్రక్కకు పెట్టి మరొక సిగరెట్ వెలిగించాడు సిగరెట్ పొగ రింగు రింగులుగా కిటికీలోంచి బయటకు పోయి గాలిలో కలిసి పోతూంది. అప్పుడే మెడికల్ కాలేజీ నుండి బయట పడ్డ అబ్బాయిలూ, అమ్మాయిలూ గుంపులుగా సాగిపోతున్నారు. అందమైన ఆ సాయంత్రం కింగ్ జార్జి హాస్పటల్ ప్రక్కనున్న రోడ్డు కోలాహలంగా వుంది

జీవిత కధ లోంచి ఆనంద్ ఆలోచనలు కొన్ని పుటలు వెనక్కి త్రిప్పాయి. అప్పుడే ఎక్కడో చర్చి గంటలు మ్రోగాయి.

అర్థరాత్రి రెండు గంటలైంది ... అంత వరకూ కుంభవృష్టిగా కురిసిన వాన వెలిసింది. సెక్రటేరియట్‌లో ఏదో పనుండి వచ్చిన ఆనంద్ ఆ రాత్రి ఏం తోచక సెకండ్‌షో సినిమాకి బయల్దేరాడు. ఏదో పాత థియేటర్లో ఇంగ్లీష్ సినిమా అది – చిత్రం నిండా నగ్నంగా వున్న ఆడవాళ్ల జలక్రీడలు. ఒళ్లు జలదరించేలా బలిష్టమైన మగవాళ్ల కౌగిళ్ల మధ్య మగువల ఘాటైన ముద్దులు. వచ్చి బజారు శృంగారం. ఛీ...ఛీ...

"భారతీయ చిత్రాలలో ఏ మాత్రం అశ్లీల దృశ్యాలున్నా అభ్యంతరం పెట్టే మన ప్రభుత్వం యిటువంటి విదేశీయ చిత్రాలను

మాత్రం మన దేశంలో ప్రదర్శించేందుకు ఎందుకు పెర్మిట్ చేస్తోందో అర్థం కాదు'' అనుకున్నాడు ఆనంద్. సినిమా వదిలే వేళ వర్షం ప్రారంభమైంది. ఆ రోడ్ముల్లో టాక్సీలు కానీ, ఆటోరిక్షాలు కానీ ఏమీ లేవు అప్పటికే జన సంచారం లేని హైదరాబాద్ రోడ్డులు వర్షపు నీటితో తడిసి; నగరంలోని మురికి వాసనని నాలుగు దిక్కులకీ ట్రాన్స్‌ఫర్ చేస్తున్నాయి.

ఒంటరిగా ఒక మూల రిక్షాలో కూర్చుని కునికిపాటు పడుతున్న రిక్షా వాడ్ని లేపి "లకిడీకా పూల్ పోనీ'' అన్నాడు ఆనంద్.

నిర్మానుష్యమైన రోడ్డు మీద నుండి రిక్షా అంతరిక్షంలో రష్యా వాడి రాకెట్‌లా దూసుకుపోతోంది—రివ్వున వీచే గాలి వల్ల చలితో ముడుచుకు కూర్చున్నాడు ఆనంద్. కొంతదూరం నడిచిన తరువాత రిక్షా వాడు స్పీడు తగ్గించాడు— అనుమానంగా చూశాడు ఆనంద్.

"తమదే ఊరు బాబూ ?'' అని అడిగేడు రిక్షా వాడు ఆరిపోయిన బీడీ ముక్క చెవి మధ్య నుంచి తీసి ముట్టిస్తూ.

"వైజాగ్ లేవోయ్'' అన్నాడు ఆనంద్.

"తెలుసులేండి బాబూ! వైజాగ్ లోవతోట కొబ్బరి బోండాలకి పేరు పడ్డది''

"అంటే ?''

"అదంతేలేండి బాబూ!'' ఏదో భావ యుక్తంగా అన్నాడు రిక్షావాడు.

"ఇంతవరకూ నా ఎరికలో ఇలాంటి చిన్న దాన్ని సూళ్లేదు బాబూ! రాజమండ్రి సరుకంటే దాని తస్సాదియ్యా జున్నుముక్క.''

"ఎవరోయ్ ?'' అని అడిగేడు విసుగ్గా ఆనంద్.

"కొత్త పిట్ట బాబూ — మొహందీలో దిగింది—తమరో చూపు చూస్తానంటే చిటికెలో లాక్కొస్తాను'' అన్నాడు ఆనంద్ వంక ఆదోలా చూస్తూ.

ఆనంద్ తల గిర్రున గానుగలా తిరిగింది. రకరకాల ఆలోచనలు చెత్తకుండీ మీద దోమల్లా ముసిరేయి. ఆలోచనల నుండి తేరుకుని ఇదమిద్ధమని తేల్చుకోక ముందే రిక్షావాడు వెనక్కి త్రిప్పేడు. నిశ్శబ్దం తాండవం చేసున్న ఆ వీధులన్నీ ఆనంద్‌కి అదోలా క్రొత్తగా, వింతగా కనబడుతున్నాయి. అవి తనని ఏ అగాధాలకో లేక ఏ ఆనంద లోకాలకో ఎక్కడికి లాక్కుపోతాయో అతను ఊహించలేక పోతున్నాడు చక చకా దొర్లిపోయే కాలంలో అరవై నిముషాలు గడిచాయి.


ఇంతలో రిక్షా ఒక మలుపు తిరిగింది. అక్కడ వీధులన్నీ ప్రశాంతంగా, అందంగా వున్నాయి. ఇళ్ళన్నీ క్రరవెక్కలతో అదోలా క్రొత్త పద్ధతిలో నిర్మించబడి వున్నాయి. అప్పుడప్పుడు ప్రశాంతతని భంగపరుస్తూ యువతీ యువకులు పారవశ్యంతో చేసే చుంబనాల ధ్వనులు వినబడుతున్నాయి.

"ఇదే మొహంధీ అయుంటుంది'' అనుకున్నాడు ఆనంద్.

ఆంధ్రుల ఆధిక్యతకీ, ఔన్నత్యానికీ చిహ్నమైన రాజధాని నగరంలో యీ మొహంధీకి ప్రత్యేక చరిత్ర వుంది...ఇక్కడి కట్టడాలన్నీ పురాతన ముస్లిమ్ సాంప్రదాయాల్ని గుర్తు చేస్తుంటాయి. మొహంధీ — ఒకప్పుడూ, ఇప్పుడూ, ఎప్పుడూ ఎందరో అభాగినుల జీవితాలు భోగలాలసుల రాక్షస రతిలో ఇక్కడే నలిగి నశించి పోతున్నాయి. అందాల సుందరీ మణుల పెదవులు ఆవేశంలో రసికులు కొరికితే, ఆ రక్తపు బొట్లు ఈ నగరపు రస్తాల మీద పడి తళ తళ ముత్యాల ముగ్గుల్లా మెరుస్తూ వుంటాయి. ఇక్కడే అనేకమంది పాదుషాలు చాంద్ బీబీల చెంపలు కోసి, ఆ రక్తంతో పాదాలకు పారాణి పూశారొకప్పుడు. అందంగా కనిపించే వైతరణి ప్రవాహం ఈ మొహంధీ — చితికి చివికిన స్త్రీల శరీరాల నుండి స్రవించిన చీమూ—నెత్తురూ మడుగు కట్టి, మురిగి, మురికి వాసన కొట్టే వేశ్యలవాడ ఈ మొహంధీ! ఎప్పుడో ఒకప్పుడు కలియుగాంతంలో ఈ సృష్టి సర్వం నశించి పోయినా ఈ మొహంధీ మాత్రం చంద్రునిలో మచ్చలా పాపపు గుర్తుగా మెరుస్తూనే వుంటుంది.

అటువంటి మొహంధీలోకి అడుగు పెట్టగానే ఆనంద్ శరీరం ఒక్కసారిగా గగుర్పొడిచింది. కట్టడాలపై అంతస్తుల కిటికీల లోంచి వెలుగు చారలు రోడ్డుమీద పడుతున్నాయి. ఒక యింటి ముందు రిక్షా నిలబెట్టి, ఆనంద్‌ని రిక్షాలోనే వుండమని రిక్షావాడు లోపలికి వెళ్ళాడు ఆనంద్ ఆ యింటిని పరిశీలనగా చూశాడు. ఆ వీధంతటికీ అదే చాలా చిన్న యిల్లు, బయట మాత్రం నీటుగా అమర్చిన పూలకుండీల లోంచి మత్తైన సువాసనలు వీస్తున్నాయి. పదినిమిషాలలో తిరిగివచ్చి "మీ పంటపడింది. లోపలికెళ్ళండి!'' అన్నాడు రిక్షావాడు.

నరక ద్వారాలు తెరుచుకుంటే లోనికి అడుగుపెట్టే పాపాత్ముడి అంతరాత్మలా తడబడుతూ లోనికి అడుగు పెట్టాడు ఆనంద్. అది ఒకే ఒక్క చిన్నగది ఆ గదిలో బ్లూ కలర్ బల్బు వెలుగుతూంది. చుట్టూ మల్లె దండలతో అలంకరింపబడ్డ మంచం మీదనే ఆమె కూర్చుని వుంది. ఒక్కసారిగా ఆనంద్ కళ్ళు చెదిరాయి. రత్న కంబళి విదిలిస్తే అందులో నుండి జిగేల్‌మని మెరుపుతీగెలా సీజర్ కళ్ళముందు మెరిసిన "క్లియోపాత్రా'' గుర్తుకొచ్చింది. అజంతా చిత్రంలా చలనం లేకుండా కూర్చున్న ఆమెలో "ఆమ్రపాలీ'' జగదేక సౌందర్యం స్ఫురించింది కొన్ని కోట్లు ఖరీదుచేసే, 'కోహినూర్ డైమండ్'లా మెరిసిపడే ఆమె శరీరపు ఛాయ ఏ దేవతో



యిచ్చిన వరంలా వుంది. ఎర్రని క్రేప్ సిల్క్ చీర, అదేరంగు జాకెట్లోంచి ఆమె అవయవాల వంపు సొంపులు, తీర్చిదిద్దినట్టుగా కనబడుతున్నాయి. ఆనంద్ ఆమె వంక అలా రెప్ప వాల్చకుండా తన్మయంగా చూస్తూ అలా అక్కడే కొన్ని క్షణాలు నిలబడిపోయాడు. అంతవరకూ ఎటో శూన్యంలోకి చూసిన ఆమె తలెత్తి అతని వంక అదోలా చూసింది

"అక్కడే నిలబడి పోయారేం?" అని అడిగింది మెల్లగా.

అంతవరకూ ఏదో పరధ్యాన్నంగా వున్న ఆనంద్ ఆ పిలుపుతో ఉలిక్కిపడి మేల్కొన్నాడు. మెల్లగా అడుగులు వేస్తూ ఆమెని సమీపించాడు.

"కూర్చోండి."

అతను అటూ—ఇటూ చూశాడు. ప్రక్కన మరో కుర్చీకానీ, మరేమీకానీ లేవు కొద్దిగా సంకోచించాడు.

"ఫర్వాలేదు- ఇక్కడ కూర్చోండి" అని తన ప్రక్కనే చోటు చూపించింది ఆమె. ఆనంద్ కూర్చున్నాడు.

"మీరిలాంటి చోటుకి రావటం యిదే మొదటిసారి అనుకుంటాను."

"అవును "

"మిమ్మల్ని చూస్తే నాకు జాలేస్తోంది."

ఆనంద్ మౌనంగా ఆమెవంకే చూస్తున్నాడు.

"ఈ యమ కూపంలో అడుగు పెడితే మీరు కూరుకుపోతారు. ఆనవాళ్ళు కూడా కనిపించనంత అడుక్కి దిగజారిపోతారు. సర్వ నాశనమైపోతారు దయచేసి వెళ్ళిపోండి" ఆమె బిగ్గరగా అరిచింది. ఒక్కసారి పెల్లుబికే దుఃఖాన్ని అదుపులో పెట్టుకోలేక వెక్కి వెక్కి ఏడుస్తూ ముఖాన్ని చేతుల్లో దాచుకుంది.

"ఏమండి" కంగారుగా ఆమెవంక చూశాడు ఆనంద్.

"నా పేరు పార్వతి."

"పార్వతీ "

"అవును. ఈ సమాజం నన్ను మోసం చేసింది. నిర్దాక్షిణ్యంగా రెక్కపట్టి నన్ని పాప పంకిలంలోకి విసిరివేసింది. ఇందులో పడి కొట్టుకుపోతున్నాను. ఎవరూ చెయ్యందించి నన్ను బయటికితియ్యరు. వీళ్లంతా మనుషులు కారు. రాక్షసులు."

పార్వతి కళ్ళనుండి స్రవించే కన్నీటి

# పరిభ్రమణం

బిందువులు జలజలా రాలాయి. కొన్ని క్షణాలు ఇద్దరి మధ్యా మౌనం. నిశ్శబ్దాన్ని భంగ పరుస్తూ—

"పార్వతీ!" అని మృదువుగా ఆమె భుజంమీద చెయ్యివేసి పిలిచాడు.

"ఊఁ"

"నీకీ జీవితం యిష్టం లేదా?"

"ఊహు"

"నాతో వస్తావా?"

"ఎందుకూ?"

"నా స్వార్థానికి కాదు- నీ బతుకు బాగుచెయ్యటానికి "

"ఏం చేస్తారు?"

"సభ్య సమాజంలో నీకో స్థానం కల్పిస్తాను నీ కాళ్ళమీద నువ్వు గౌరవంగా బ్రతకగలిగేలా చేస్తాను."

"సందేహించకు పార్వతీ!" అన్నాడు ఆనంద్

"సరే" అంది పార్వతి.

### సంతాన విహీనుడు

చుట్టపక్కాల చావులో
సంతానం లేని ధనికుడు
వయసులో వున్న వితంతువు,
భర్తను విడిచిన ఏ యువతి

### కోపం

ధనవంతుని కోపం దారుణ తాపం
మనిషి నధి మసి చేయవచ్చు.
ధన హీనుని కోపం కనిపించని శాపం
మనిషి కుదుగునే మసి చేయవచ్చు.

### సిటీబస్సు

మదరాసు, మధుర కావచ్చు
మరి యే వూరైనా కావచ్చు
రావలసిన వేళకు వచ్చే
ఎలా అవుతుందది సిటీబస్సు ?

### బోధకుడు

ఆ ఆలు దిద బెట్టినా
ఆముక్తను వివరించినా !
బోధకుని కర్తవ్యం
తెలియజెప్పడం !

-చల్లా రాధాకృష్ణశర్మ

కాల చక్రంలో మరి కొన్నేళ్ళు గడిచాయి. పార్వతి జయించింది. అయితే ఆనంద్ మాత్రం ఓడిపోయాడు. పార్వతిని ఏదో సంస్కరిద్దామనుకొన్న అతనికి అపజయమే మిగిలింది పార్వతి చదువుకొంది ఆనంద్ ఆమెని మెడికల్ కాలేజీలో చేర్పించాడు. ఆ తర్వాత హాస్పిటలులో హౌస్ సర్జన్‌గా చేరింది. ఆమె జీవితం సాఫీగా సాగిపోతున్నందుకూ, ఆమె జీవితానికి తనే నిర్మాత అయినందుకూ సంతోషించాడు ఆనంద్ కాని ఆ సంతోషం ఎన్నాళ్ళో నిలవలేదు అతనికి ఒకానొకరోజు జరిగిన సంఘటన.. యింకా ఆ సంఘటన అతని స్మృతిపథంలో మెదులుతూనే వుంది.

హాస్పిటలులో పేరుపడ్డ డాక్టర్ రవీంద్ర, అతని కౌగిట్లో కులుకుతున్న పార్వతి... ఒక్కసారిగా ఆ దృశ్యం కంటబడ్డ ఆనంద్‌కి తను నిలబడ్డ భూమి బద్దలై తనని మింగుతున్నట్టుగా అనిపించింది. కళ్ళవెంట, అప్రయత్నంగా తను ఎంత ఆపుకోవాలని ప్రయత్నించినా కన్నీళ్ళు జలజలా రాలాయి. వెంటనే పార్వతిని పిలిచి అడగాలని అంతరాత్మ ముందు కురికింది కాని అడిగితే ఏమంటుంది పార్వతి? ఓ వేళ తన మాటకి విలువివ్వకపోతే?... అయినా పార్వతి తనమాటకెందుకు విలువివ్వాలి? తను పార్వతికి చేసింది ఏమిటి? ఆమెని శాసించే హక్కు తనకెక్కడుంది? తనెవరు? పార్వతి ఎవరు? ఎవరికి ఎవరూ ఏమీ కాని ఈ విశాల ప్రపంచంలో ఎక్కడో ఒక స్పాట్‌దగ్గర కలుసుకున్నారు. ఆ తరువాత విడిపోయే సమయమొచ్చింది విడిపోయారు- అంతే!

"పార్వతిని తను ప్రేమిస్తున్నానా?" అని తనను తానే ప్రశ్నించుకున్నాడు ఆనంద్.

"లేదు" అంది అంతరాత్మ.

"అయితే ఆమెకోసం తనెందుకు బాధ పడాలి ?"

"అనవసరం !" అనిపించింది ఆనంద్‌కి— అంతే...!

ఆ తర్వాత మరికొన్నాళ్ళకి పార్వతీ రవీంద్రలు ఎటో వెళ్ళిపోయారని తెలిసింది. బరువుగా అదోలా నిట్టూర్చాడు ఆనంద్. ఆ నాటి నుంచీ... అతను ఆలోచిస్తున్నాడు. అతను అనబడే ఆనంద్ అలా ఆలోచిస్తూనే వుంటాడు... ...